

తొలిరోజు సింగిల్ నామినేషన్ దాఖలు

ఏలూరు: సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో మొదటిరోజు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. జిల్లాలో నాలుగు సర్పంచులు, 47 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు కావాల్సి ఉంటే కేవలం ద్వారకాతిరుమల మండలం, గుణ్ణంపల్లి ఆరో వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలైంది. సర్పంచి పదవులకు నామినేషన్ బోణీ కాలేదు. మంగళవారం కావడం, నామినేషన్ దాఖలాకు సాధారణంగా ముహుర్తాలు చూడడం పరిపాటికావడంతో ఒక్క నామినేషనే దాఖలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు విస్తృత ప్రచారం చేశారని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఆయన పెదపాడు మండలం, అప్పనవీడు పంచాయతీ నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమలవుతుందని డిపిఒ అన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశామన్నారు. నియమావాళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం అప్పనవీడు పంచాయతీని ఆకస్మికంగా డిపిఒ తనిఖీ చేశారు.

బిల్లుల మోత..!


విద్యుత్ ఛార్జీల బాదుడుతో జనం హడల్

వాడకంతో సమానంగా అదనపు ఛార్జీల భారం

ఫిక్స్‌డ్, కస్టమర్, ట్రూఅప్ ఛార్జీల మోత

హడలిపోతున్న జిల్లా ప్రజానీకం

ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నాపేరు వరలక్ష్మి.. ఏలూరులో అద్దె ఇంట్లో ఉంటున్నాం. జులై నెలలో 122 యూనిట్ల కరెంటు వినియోగించాం. దీనికి బిల్లు రూ.403 వేశారు. వివిధ రకాల అదనపు ఛార్జీల పేరుతో మరో రూ.400 వేశారు. దీంతో ఈ నెల మూడో తేదీన తీసిన కరెంటు బిల్లు ఏకంగా రూ.804 వచ్చింది. ఇలాగైతే సామాన్య ప్రజానీకం ఎలా బతకాలి. అదనపు ఛార్జీల పేరుతో జనాలను ఇబ్బంది పెట్టడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వమే చెప్పాలి.'

పైన పేర్కొన్న వరలక్ష్మి మాత్రమే కాదు. జిల్లాలో ఏ ఒక్కరిని కదిలించినా కరెంటు బిల్లుల గురించి ఘొల్లుమంటున్నారు. విద్యుత్ బిల్లులు చూసి జిల్లా ప్రజానీకం హడలిపోతున్నారు. మొన్నటి వరకూ వేసవి కావడంతో వాడకం ఎక్కువ ఉంటుందని, అందుకే బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని అంతా భావించారు. అధికారులు కూడా అదేవిధంగా జనాన్ని ఏమార్చిన పరిస్థితి ఉంది. జులైలో విద్యుత్ బిల్లు చూసి అంతా నోరెళ్లబెడుతున్నారు. జులైలో వర్షాల కారణంగా విద్యుత్ వాడకం బాగా తగ్గిపోయింది. ఎసిలు, ఇన్వెర్టర్ల వాడకం వంటివేమీ లేవు. విద్యుత్ వాడకం తగ్గినప్పటికీ బిల్లుల మోత ఏమాత్రం తగ్గలేదు. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వం వివిధ ఛార్జీల పేరుతో విధిస్తున్న అదనపు భారమేనని స్పష్టంగా తేలిపోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అదనపు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో అత్యధికం సామాన్య ప్రజానీకానివే. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. గడిచిన రెండు నెలలుగా వస్తున్న విద్యుత్ బిల్లులు చూసి జనానికి ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వాడిన కరెంటు వినియోగానికి, అదనపు ఛార్జీల భారం ఒకేలా ఉంటుంది. రెండు ఫ్యాన్లు ఉన్న ఇంటికి సైతం రూ.800కుపైగా విద్యుత్ బిల్లు వచ్చింది. ఈ బిల్లులో సగం అదనపు ఛార్జీల భారమే ఉండటం విశేషం. చిరు వ్యాపారులు, వివిధ సంస్థల కార్యాలయాలకు సంబంధించిన బిల్లులు సైతం భారీగా వచ్చాయి. వినియోగించిన కరెంటుకు అదనంగా ఆరు రకాల ఛార్జీలను వినియోగదారులపై విద్యుత్‌శాఖ వడ్డిస్తోంది. ఇందులో ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్, ఇడి, సర్, ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ వంటి అదనపు ఛార్జీల పేరుతో మోత మోగిస్తున్నారు. కరెంటు ఎంత తక్కువగా వినియోగించినా బిల్లుల మోత మాత్రం తప్పడం లేదు. గతంలో రూ.300 కరెంటు బిల్లు ఉండే వినియోగదారులు ఇప్పుడు రూ.600కుపైగా చెల్లించాల్సి వస్తోంది. గృహ వినియోగదారులు, చిరువ్యాపారుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. దీంతో ప్రభుత్వంపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు వేసి విద్యుత్, చెత్తపన్ను వంటి పేరుతో ప్రభుత్వం లాగేసుకుంటుందనే చర్చ జనాల్లో నడుస్తోంది. విద్యుత్ ఛార్జీల భారంపై జనం తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామం, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా విద్యుత్ ఛార్జీలపైనే చర్చించుకుంటున్న పరిస్థితి ఉంది. దీంతో ఫ్యాను వేయాలంటేనే వినియోగదారులు భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం అదనపు ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.





అనర్హుల 'అసైన్డ్'ను స్వాధీనం చేసుకోవాలి

అన్యాక్రాంతమైన భూములు హక్కుదారులకివ్వాలి

సచివాలయాల్లో అసైన్డ్ లబ్ధిదారుల పేర్లు ప్రకటించాలి

కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలి

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ముగిసిన 'భూమి కోసం సమర శంఖారావం' పాదయాత్ర

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి హక్కుదారులకు లేదా వారి వారసులకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు పొందిన పేదలకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ రూపొందించిన 9/77 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయడం దుర్మార్గమని విమర్శించారు. మంగళవారం వ్యకాస ఆధ్వర్యాన స్థానిక సుందరయ్య కార్యాలయం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ భూముల ఆర్డినెన్స్ సవరణ వల్ల అసైన్డ్‌దారుల కంటే అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములే ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదలకంటే అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అసైన్డ్ లబ్ధిదారుల లిస్టును గ్రామ సచివాలయంలో బహిరంగపరచాలని కోరారు. అందులో అర్హులకే యాజమాన్యపు హక్కును కల్పించాలన్నారు. అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,21,160 కుటుంబాలకు చెందిన 27,41,609 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలు ప్రతీ గ్రామ సచివాలయంలో బహిరంగపరచాలని కోరారు. ప్రభుత్వం భూ కొనుగోలు పథకంలో భూమి సేకరించి భూమి లేని పేదలకు పంచాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు సీలింగ్ భూములతో పాటు పేదలకు పంచడానికి అవకాశమున్న అన్ని రకాల భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారంలో పోలీసుల జోక్యం ఉండకూడదన్నారు. పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించే పేదలపైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ భూ శంఖారావం పాదయాత్ర సందర్భంగా రెండు మండలాల్లో సుమారు 20 గ్రామాల్లో జరిగిన యాత్ర దృష్టికి పేదలు అనేక సమస్యలు తెచ్చారన్నారు. ఈ సందర్భంగా వచ్చిన 10 రకాల భూ సమస్యలను ఆర్‌డిఒ ఎఒకి వినతిరూపంలో అందించారు. ఈ సందర్భంగా జీవరత్నం, రామకృష్ణ మాట్లాడుతూ టి.నరసాపురం మండలం అల్లూరి సీతారామరాజు నగర్ ఇళ్లస్థలాల సమస్యలు పరిష్కరించాలన్నారు. రామమ్మగూడెం భూ సమస్య, బచ్చులేటిగూడెం అటవీ భూ సమస్యలు పరిష్కరించడంలో మండల రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. అనేకమార్లు సమస్యలు అధికారుల దృష్టిలో పెట్టినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నట్లు వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, కేతవరం, చక్రదేవరపల్లి, గురవాయిగూడెం గ్రామాల్లో ఆక్రమణలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూముల కోసం పేదలు, దళితులు దశాబ్దాల తరబడి పోరాడుతున్నప్పటికీ రెవెన్యూ అధికారుల్లో చలనం లేదన్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో భూ రికార్డుల అవకతవకలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రెండు మండలాల తహశీల్దార్‌లు రికార్డులు తారుమారు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో భూములను భూస్వాములకు కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రకాలువ మిగులు భూములు పేదల సాగుకు అవకాశం కల్పిస్తూ ఏక్‌సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మిగులు భూముల్లో పశు పోషణకు, వ్యవసాయానికి పేదలను ఉపయోగించుకుంటుంటే వాటికి పట్టాలివ్వకపోగా పోలీసులతో నిర్బంధించి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ భూముల్లో పోలీసుల దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం పేదల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని దళిత, గిరిజన పేదలకు భూములు పంచాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోనే రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తామా ముత్యాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు మడకం సుధారాణి, ఎ.ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజమండ్రి దానియేలు, యాగంటి సీత, రామలక్ష్మి, దుర్గ, రుక్మిణి, కె.సుబ్బారావు, మస్తాన్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో అరాచకాలకు నిరసనగా శాంతి ర్యాలీలు

ప్రజాశక్తి - భీమడోలు

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపాలని, భారత లౌకిక రాజ్యాంగాన్ని, మతసామరస్యాన్ని కాపాడాలని, బాధితులకు రక్షణ కల్పించాలని, ప్రధాని మోడీ ఈ విషయాలపై మాట్లాడాలని కోరుతూ భీమడోలులో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన మంగళవారం ఐక్య శాంతి ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి రైల్వే గేట్ వద్ద నుంచి జంక్షన్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పాస్టర్స్ అసోసియేషన్ భీమడోలు శాఖ అధ్యక్షులు డి.వి.రత్నం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు పి.సునీతామాన్ సింగ్, ఎఎంసి చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ, ఎంపిటిసి ముళ్లగిరి జాన్సన్, రైతు సంఘం నాయకులు కట్టా భాస్కర్‌రావు, జన విజ్ఞాన వేదిక నాయకులు జి.ప్రసాదరావు, జమాత్ హింద్ ముస్లిం నాయకులు జహీర్, కెవిపిఎస్ మండల కన్వీనర్ సుమన్‌బాబు, ఐలు నాయకులు బి.రాజారావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్ అచ్యుతం, జన విజ్ఞాన వేదిక నాయకులు జి.ప్రసాదరావు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్‌కు వినతిని అందజేశారు.

ద్వారకాతిరుమల: మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ మండల క్రైస్తవ, ప్రజా సంఘాలు, యుపిడబ్ల్యూఎ పాస్టర్స్ చర్చి సభ్యుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున క్రైస్తవులు, పాస్టర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మణిపూర్‌లో అల్లర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించాలని, అన్ని సంఘాలు, ప్రజలు స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీ బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకూ సాగింది.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే కొబ్బరి రైతులకు నష్టాలు

విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతితో కుదేలు

కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు

ప్రజాశక్తి - పెదవేగి

విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతితో మార్కెట్‌లో కొబ్బరికాయలకు ధర తగ్గించడంతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇందుకు కేంద్రప్రభుత్వ విధానాలే కారణమని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు తీవ్రంగా విమర్శించారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించి రైతుల నుండి కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు ఆవరణలో కొబ్బరి రైతుల సంఘం, ఎపి రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొబ్బరి రైతుల జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కొబ్బరి రైతుల సమస్యలపై తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వై.కేశవరావు మాట్లాడుతూ కొబ్బరికాయలకు కనీస ధర రాక కొబ్బరి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కొబ్బరి రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాలలో కొబ్బరి సాగవుతుందని చెప్పారు. కొబ్బరి ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్ ఉన్నా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకునేందుకు, తద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాల వైపు నుండి కనీస చర్యలు లేకపోవడం అన్యాయమన్నారు. విదేశాల నుండి కొబ్బరిపొడి దిగుమతికి అవకాశం కల్పించడం ఇక్కడి కొబ్బరి రైతులకు ధర లేకుండా చేయడం తగదన్నారు. మరోవైపు తెగుళ్లు వలన కొబ్బరి దిగుబడి తగ్గిపోయిందన్నారు. ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగులు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి పథకం కొబ్బరి రైతులకు వర్తింపజేయాలని కోరారు. కేరళ తరహాలో సహకారరంగంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని కోరారు. కొబ్బరి రైతులను ఆదుకోకపోతే సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తక్షణం తెరవాలని డిమాండ్ చేశారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు నిషేధించాలన్నారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు ఆపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. కొబ్బరి రైతుల సమస్యలపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నెల 14న కొబ్బరి రైతుల సమస్యలపై చలో కలెక్టరేట్ ధర్నా నిర్వహించాలని సదస్సు తీర్మానించింది.

అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, కొబ్బరి రైతులు నవుడు సత్తిబాబు, బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, పులగం వేణుగోపాల రెడ్డి, గంటా పాపారావు, కల్లం శివారెడ్డి, గుదిబండి రమేష్‌రెడ్డి, పానుగంటి అచ్యుతరామయ్య మాట్లాడారు. కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని, కొబ్బరికాయకు కనీస ధర రూ.15 ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కొబ్బరి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యదర్శి బొల్లి రామకష్ణ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో వివిధ మండలాలకు చెందిన కొబ్బరి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

10, 17 తేదీల్లో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపడుతున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగల నివారణ దినోత్సవానికి సంబంధించిన పోస్టరును డిఎఫ్ఒ, మున్సిపల్ కమిషనర్, డిఆర్ఒ, డిఎంహెచ్ఒ, ఎన్‌సిడి జిల్లా పోగ్రాం ఆఫీసరు, వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఈ మాత్రల పంపణీ ఈ నెల 10, 17 తేదీల్లో జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 4,00,536 మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన 4,00,536 మందికి మాత్రల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ రవీంద్రనాథ్‌థామస్, జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్ఒ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ మానస, ఎవిఆర్ మోహన్, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఇఒ శ్యామ్ సుందర్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, వ్యవసాయశాఖ జెడి రామకష్ణ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

మోకాళ్లపై విఆర్‌ఎల నిరసన

విఆర్‌ఎలను విస్మరిస్తే జగన్‌కు గుణపాఠం తప్పదు : సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విఆర్‌ఎల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ హెచ్చరించారు. విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ముందు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాజీ అధ్యక్షతన చేపట్టిన సామూహిక నిరాహార దీక్షల శిబిరాన్ని రెండో రోజు ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలు మోకాళ్లపై నిలబడి, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 26 జిల్లాల్లో విఆర్‌ఎలు శాంతియుతంగా నిరాహార దీక్షలు చేస్తున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఇచ్చిన వాగ్దానాన్ని నాలుగున్నర సంవత్సరాలైనా నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాలుగేళ్లుగా సిఎం జగన్ విఆర్‌ఎలకు ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న కాలంలో విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గతంలో విఆర్‌ఎలు పోరాడి సాధించుకున్న డిఎను ఈ ప్రభుత్వం నిలిపివేసి కార్మికుల పొట్టగొట్టడం హేయమైన చర్య అని ఆయన విమర్శించారు. తెలంగాణలో విఆర్‌ఎలను ప్రభుత్వ విభాగాల్లోకి తీసుకుని పే స్కేలు అమలు చేశారని, అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలో కూడా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి గంగాధర్‌రావు మాట్లాడుతూ నామిని విఆర్‌ఎలను విఆర్‌ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా అర్హత ఉన్న వారికి ఇవ్వాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన విఆర్‌ఎలకు వారి కుటుంబ సభ్యులకు విఆర్‌ఎ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో విఆర్‌ఎల సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, రవికుమార్, కాలేషా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పోలవరం' ఆలస్యానికి చంద్రబాబే కారణం : అంబటి

ప్రజాశక్తి - పోలవరం

డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో చంద్రబాబు చేసిన తప్పిదం పోలవరం ప్రాజెక్ట్‌కు అవరోధంగా మారిందని రాష్ట్ర వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి పోలవరం పనులు ఎలా ఉన్నాయి.. తమ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనుల ప్రగతిని నాడు-నేడు విధానంలో అధికారులకు, పాత్రికేయులకు ప్రాజెక్ట్ సైట్‌లో పర్యటించి సోమవారం తెలియజేశారు. అనంతరం ప్రాజెక్ట్ సమావేశపు హాలులో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో వేగవంతమైన పోలవరం పనులను ఆయన కుమారుడు సిఎం జగన్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌పై చంద్రబాబు అసత్యాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారని, ప్రాజెక్ట్ పనులపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాములులు, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, స్పిల్ ఛానెల్, స్పిల్ వే పూర్తి చేయకుండా గోదావరి నీళ్లు మళ్లించకుండా డయాఫ్రమ్ వాల్ నిర్మించడమే చంద్రబాబు చేసిన చారిత్రాత్మక తప్పిదమన్నారు. దీని కారణంగానే 2019-20లో వచ్చిన వరదల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతినిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ఈ జాతీయ ప్రాజెక్ట్‌ను తాను నిర్మిస్తానని ఎందుకు ఒప్పుకున్నారని, 2018లో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తానని చెప్పి ఎందుకు పూర్తి చేయలేక పోయారని, కాఫర్ డ్యాములు పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్ ఎందుకు నిర్మించారని చంద్రబాబును ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్ట్ 45.72 కాంటూరుకే నిర్మిస్తామని, 41.15 తగ్గిస్తామని ప్రచారంలో నిజం కాదన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో మూడు దశలుంటాయని, మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ నిర్మించి నీటి నిల్వచేసి పరిశీలిస్తామని, ఏమైనా సమస్యలుంటే గుర్తించి సరిచేస్తామన్నారు. అనంతరం రెండో దశలో కూడా అదేవిధంగా పరిశీలిస్తామన్నారు. చివరిగా 45.72 కాంటూరుతో ప్రాజెక్టును నిర్మిస్తామన్నారు.


ప్రాజెక్టు వద్ద మాట్లాడుతున్న అంబటి

పోలవరం ప్రాజెక్ట్ 194 టిఎంసిల నీటిని నిల్వ చేసే సామర్థ్యం గలదన్నారు. 56 లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకుంటుందన్నారు. ఇప్పటివరకు అత్యధికంగా 36 లక్షల క్యూసెక్కుల వరద నీరు 2016లో నమోదైందన్నారు. 41.15 కాంటూరు వరకూ 119 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉంటుందన్నారు. 2017-18 రేట్ల ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.55 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. 41.15 కాంటూర్ వరకూ 20,946 కుటుంబాల వారు నిరాశ్రయులవుతారని, వారికి పునరావాసం కల్పించాలన్నారు. 45.72 కాంటూరుకు మరో 16,642 కుటుంబాలు నిరాశ్రయులవుతారని, వారికీ పునరావాసం కల్పించాల్సి ఉంటుందన్నారు. మంత్రివెంట పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఇఎన్‌సి నారాయణరెడ్డి, సిఇ సుధాకర్‌బాబు, ఎస్‌ఇ నరసింహమూర్తి ఉన్నారు.

వాతవరణ మార్పుల దుష్ప్రభావాల నిరోధానికి చర్యలు

ఏలూరు టౌన్: వాతావరణ మార్పు వల్ల జరిగే దుష్ప్రభావాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమి మీటింగ్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు-మానవ ఆరోగ్యంపై ప్రభావం అంశంపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పు వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, దీంతోపాటు కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులతో పాటు ఓజోన్, వాయు కాలుష్యం, రేడియేషన్ వంటి దుష్ప్రభావాలుంటున్నాయని యునైటెడ్ నేషన్స్ రిపోర్ట్ ఇచ్చిందన్నారు.

సిఏ ఫౌండేషన్‌లో ఐశ్వర్యకు ర్యాంకు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఛార్టర్డ్ ఎకౌంటెంట్ ఎట్రన్స్ (సిఎ) ఫౌండేషన్ కోర్సులో మండలంలోని పెద్దవెల్లమిల్లికి చెందిన రాయుడు ఐశ్వర్య ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకు సాధించింది. దేశవ్యాప్తంగా జూన్‌లో నిర్వహించిన ద ఇనిస్టిట్యూట్ చార్టర్డ్ ఎకౌంటెంట్ ఆఫ్ ఇండియా మంగళవారం విడుదల ఫలితాల్లో ఐశ్వర్య అర్హత సాధించింది. ఈ పరీక్షను దేశవ్యాప్తంగా లక్షా మూడు వేల 515 మంది రాశారు. వీరిలో 25 వేల మంది మాత్రమే అర్హత సాధించారు. ఐశ్వర్య పదో తరగతిలో ప్రథమ స్థానం, అలాగే తాడేపల్లిగూడెంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో ఎంఇసి చదివి పట్టణ రెండో ర్యాంకు సాధించింది. సుమారు ఆరు నెలలుగా కృషి, పట్టుదలతో చదివి సిఎ ఫౌండేషన్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చాటింది. తద్వారా సిఎ ఇంటర్ చదివేందుకు అర్హత సాధించింది. తాను చార్టర్డ్ ఎకౌంటెంట్ ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యమని ఐశ్వర్య తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఐశ్వర్య తండ్రి పౌలుకుమార్ వ్యవసాయకూలి కాగా, తల్లి మాలతి గృహిణి. వారికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె సౌందర్య ఆదిత్య జూనియర్ కళాశాలలో ఎంపిసి ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఇద్దరు కుమార్తెలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.



11న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 11వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ పి.మల్లేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచిలు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావలసినదిగా ఆమె తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలను హెడ్మాస్టర్ గుళ్ల ప్రసాదరావు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు జూనియర్ స్థాయి, సీనియర్ స్థాయి పరుగు పందెం పోటీలు, ఇతర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

మండల సమాఖ్య ఆర్థిక నిర్వహణ సమావేశం మండల సమాఖ్య ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ ఆవశ్యకత, ఫైనాన్సియల్ ప్రిన్సిపుల్స్-మండల సమాఖ్యల సుస్థిరతపై ఎపిఎం కుటుంబాబు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉన్న గ్రామ సంఘాల యొక్క ఆర్థిక నిర్వహణపై, మండల సమాఖ్యల ఆర్థిక నిర్వహణ, సిబిలలో ఫైనాన్సియల్ లిటరసి యొక్క ఆవశ్యకత, సంస్థల పనితీరు విధానము తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అకౌంటెంట్ నిధులు దుర్వినియోగం నివారించడానికి, విజిలెన్సు నిర్వహణ పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు, అకౌంటెంట్ నాగలక్ష్మి, విఎలు పాల్గొన్నారు.

గొల్లపల్లి హైస్కూల్లో జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గొల్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మన దేశ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేది చేనేత అని అన్నారు. ప్రతిఒక్కరూ వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుక్కులూరు గ్రామంలో మంగళవారం మండలంలోని 135 మంది రైతులకు నవధాన్యాల కిట్లను ఎంపిపి ఆరేపల్లి శిరీష పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయటం ద్వారా భూమిలో కర్బన పదార్థాలు పెరిగి భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సర్పంచి తమ్మంద్రు బుజ్జి, ఉప సర్పంచి అచ్చి కాసులు, వైసిపి నాయకులు పాలడుగు నాని పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థులు పెడదోవ పడుతూ ఉంటారని, వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిపై దృష్టి సారించాలని లెక్చరర్స్, ప్రొఫెసర్స్, ఇతర సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆశ్రం మెడికల్ కాలేజీలో కాలేజీ యాజమాన్యానికి, ప్రొఫెసర్లకు, సిబ్బందికి ర్యాగింగ్ నిరోధంపై, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండేలన్నారు. వారు పెడదోవ పెట్టకుండా వారిని గమనిస్తూ ఉండాలన్నారు. వారికి అవసరమైన కౌన్సిలింగ్ ఇస్తూ ఉండాలని సూచించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి కాలేజీని ఫ్రీ ర్యాగింగ్ కాలేజీగా ముందుకు తీసుకెళ్లే ఉద్దేశ్యంతో యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు నిరంతరం కృషి చేస్తూ ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ర్యాగింగ్ కమిటీ మెంబర్స్ కూనా కృష్ణారావు, డాక్టర్ సిహెచ్.వంశీకృష్ణ, ఎల్.వెంకటేశ్వరరావు, సోషల్ వర్కర్ రాజేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ గోకరాజు రతీదేవి, కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణమూర్తి, సిఇఒ కె.హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై రూ.8 లక్షల జరిమానా

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు టౌన్ సెక్షన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు చేసి రూ.8 లక్షల జరిమానా విధించారు. టౌన్ సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ ఇఇ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 51 బృందాలుగా ఏర్పడి 2,233 గృహ సర్వీసులు, 294 వాణిజ్య సముదాయాలు, 191 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈక్రింది నెంబర్లకు 9440812362, 9440812363, 8331014951 సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ తనిఖీలలో గుడివాడ ఇఇ రామకృష్ణ, కైకలూరు డిఇఇ రామయ్య, కైకలూరు టౌన్ ఎఇ కె.శ్రీనివాస మూర్తి, గుడివాడ డివిజన్ పరిధిలోని ఎఇలు, జెఇలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి ట్రస్టు భూముల కౌలు వేలంలో గందరగోళం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గొల్లపల్లి గ్రామంలో రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్ భూముల వేలం ప్రక్రియలో మంగళవారం గందరగోళం నెలకొంది. అధికారులు టెండర్ బాక్స్ తెరిచి వివరాలను ప్రజలకు తెలియజేశారు. గ్రామ మాజీ సర్పంచి, ట్రస్ట్ సభ్యులు గోగినేని శ్రీనివాస అప్పారావు మాట్లాడుతూ ట్రస్టు భూములు కౌలు టెండర్ ప్రక్రియపై కోర్టు పార్షియల్ స్టే విధించిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు అంగీకరించడం దారుణం

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

వలసపల్లి గ్రామానికి చెందిన అబ్బదాసరి జోజి(37) మంగళవారం వలసపల్లి నుంచి లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ ఢీ కొట్టడంతో సంఘటనా స్థలంలో మృతి చెందాడు. ఇతనికి భార్య, పాప, బాబు కలరు. ఇతడు వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.


లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

లారీ ఢీకొని వ్యక్తి ఒక మృతి చెందగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన మంగళవారం ఉదయం మండలంలోని పొద్దువాకలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వనుదురుకు చెందిన నంగెడ్డ మునిబాబు(57) వనుదురు నుంచి కైకలూరు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన తాడంకి ఏసుపాదంతో కలిసి బైక్‌పై ఇంటి వద్ద నుంచి బయలు దేరారు. ఈ క్రమంలో బైకు మండలంలోని పొద్దువాక పరిధిలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి బైకును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో మునిబాబు తలకు తీవ్ర గాయాలు కాగా, ఏసుపాదంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్సకై మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మునిబాబు మృతి చెందాడు. మృతిని కుమారుడు నంగడ్డ శేషుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మునిబాబు అకాల మరణంతో వణుదురు గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

10న నులుపురుగుల జాతీయ దినోత్సవ సందర్భంగా..

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



చాట్రాయిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు..

ప్రజాశక్తి - చాట్రాయి

ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు బాలబాలికలలో నులుపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు సురక్షితమైనవని పిహెచ్‌సి వైద్యాధికారులు డా.కె.విజయలక్ష్మి, డా.ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులుపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా 10వ తేదీన ఈ మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలలో పిల్లలకు మింగించడం జరుగుతుందని చాట్రాయి వారు తెలిపారు. రక్తహీనతకు, పోషకాహార లోపానికి ఈ నులుపురుగులు కారణమన్నారు. స్థానిక చాట్రాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఒ దుర్గాప్రసాద్, ఎంఇఒ బ్రహ్మాచారి, వైద్యాధికారుల సమక్షంలో ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ, వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ మాత్రలు అందేటట్టుగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఎంఇఒ మాట్లాడుతూ 10వ తేదీన 100 శాతం మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు అయ్యేటట్లు, పిల్లలందరూ మాత్రలు మింగేటట్లుగా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జివి రమణ, సూపర్‌వైజర్ ప్రభాకర్ రావు, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నులుపురుగుల నివారణ కోసం విద్యాసంస్థలకు టాబ్లెట్లను పంపిణీ చేసినట్లు ఎఎన్ఎం కొక్కిరిగడ్డ విజయకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ అరగని పదార్థాలతో నులుపురుగులు ఏర్పడే ప్రమాదం ఉందని, వాటి నివారణకు అల్బెండజోల్ టాబ్లెట్లను పాఠశాలలకు, కళాశాలలకు అందించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగు నివారణా దినోత్సవం సందర్భంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా యార్లగడ్డ శ్రీదేవి

ముసునూరు: మండల ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా యార్లగడ్డ శ్రీదేవి పూర్తి బాధ్యతలు మంగళవారం చేపట్టారు. ఇప్పటి వరకూ పనిచేసిన డి.రోజ్‌లక్ష్మి కుమారి ఉద్యోగవిరమణ చేయగా, ఈమె గత కొంతకాలం వరకూ ఇంఛార్జి ప్రిన్స్‌పల్‌గా వ్యవరించారు. మంగళవారం నుంచి పూర్తి బాధ్యతలతో కూడిన ప్రిన్స్‌పల్‌గా ప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన్నట్లు ఆమె తెలిపారు.

స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాలి : ఎంపిడిఒ

టి.నరసాపురం: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను స్మరించుకోవాలని ఎంపిడిఒ మంగాకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'నా భూమి నా దేశం' కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ గ్రామ పంచాయతీలో స్వాతంత్ర్య సమర యోధుల పేర్లతో శిలాఫలకాలు ఏర్పాటు చేసి, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని ఆమె తెలిపారు.

పెచ్చులూడుతున్న అండర్ టన్నెల్ శ్లాబ్



పెచ్చులు ఊడుతున్న నారాయణపురం రైల్వే అండర్ పాస్ స్లాబ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైల్వే స్లాబ్ అడుగు భాగం నుంచి సిమెంట్ పెచ్చులు ఊడడంతో సమస్యను రైల్వే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తామని సర్పంచి డిడ్ల అలకనంద తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి పెచ్చులు ఊడకుండా తగు ఏర్పాట్లు తీసుకునేలా ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లామని వైసిపి మండల కన్వీనర్ మంగారావు పేర్కొన్నారు. నారాయణపురంలో రైల్వే అండర్ పాస్ తూము నుంచి వెళ్లే దారిలో రైల్వే స్లాబ్ అడుగు భాగం నుంచి సిమెంట్ పెచ్చులు కింద పడుతున్నాయి. ఈ వంతెనపై నుంచి రైలు వెళ్లేటప్పుడు వైబ్రేషన్‌కి ఎప్పుడో బ్రిటిష్ కాలంలో కట్టిన స్లాబ్ దెబ్బతిని సిమెంట్ పెచ్చులు పడిపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ తూము కింద నుంచి రోజుకి వేలాది మంది వాహనదారులు, విద్యార్థులు ప్రయాణిస్తున్నారు.



పెచ్చులు ఊడి ఉచలు బయటకు కనిపిస్తూ..

10న విద్యుత్ కార్మికుల సమస్యలపై మహాధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 10వ తేదీన విశాఖపట్నం సిఎండి కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ పిలుపునిచ్చారు. చింతలపూడి మండలంలో ఉన్న సబ్ స్టేషన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలో మాట తప్పను - మడమ తిప్పనని వాగ్దానం చేసిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు అమలు చేయకుండా మాట తప్పారని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఎన్నో సందర్భాల్లో పోరాటాలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ అమలు చేయడం వల్ల కార్మికుల లబ్ధి పొందారన్నారు. కానీ ఆంధ్రరాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ద్రోహం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణం పెట్టి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వారి సమస్యలు పరిష్కరించనిచో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ, ముస్తఫా, రవి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు..

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్(74) మృతి ప్రజాకారులకు, సాహితీ రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని ప్రజానాట్యమండలి గాయకుడు, ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని వృత్తి సంఘాల జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ గద్దర్ ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులలో ఒకరని, తన గాత్రంతో తెలుగు రాష్ట్రాల ప్రజలలో తనదైన శైలిలో ఉర్రూతలూగించారని కొనియాడారు. మా భూమి సినిమాలో నటించడమే కాకుండా, పలు సినిమాలకు పాటలు రాశారన్నారు. నీ పాదం మీద పుట్టుమచ్చని చెల్లెమ్మ పాటకు రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డు ప్రకటించినా గద్దర్ వాటిని సున్నితంగా తిరస్కరించారని ఆదిశేషు తెలిపారు. గద్దర్ ప్రజా ఉద్యమాలకు పాటలు రాసి, ఆ ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొని, ప్రజలను ఉత్తేజ పరిచే వారిని వారు కొనియాడారు. తెలంగాణా ఉద్యమంలో తన పాటలతో ఉద్యమానికి ఊపు తెచ్చారని ఆదిశేషు తెలిపారు.

నేడు మహాధర్నాను జయప్రదం చేయాలి : ఎఐటియుసి

ఏలూరు టౌన్: క్విట్ ఇండియా దినోత్సవం రోజైన ఆగస్టు 9వ తేదీన 'క్విట్ మోడీ సేవ్ ఇండియా' నినాదంతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న మహా ధర్నాకు ఏలూరు జిల్లా నుంచి ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. భారతదేశం నుంచి బ్రిటీష్ వారిని తరిమికొట్టేందుకు స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా క్విట్ ఇండియా కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా భారతదేశ ప్రభుత్వరంగ సంస్థలని ప్రయివేటీకరిస్తూ, కార్మిక హక్కుల్ని కాలరాస్తూ, భారతదేశాన్ని తిరోగమన దిశగా తీసుకెళున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కేంద్ర కార్మిక సంఘాలు 'క్విట్ మోడీ సేవ్ ఇండియా' కార్యక్రమానికి పిలుపునిచ్చాయని ఆయన తెలిపారు. 9వ తేదీన విజయవాడలో జరుగుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు జిల్లాలో ఇప్పటికే ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా అధిక ధరలు నియంత్రించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, భారతదేశ లౌకిక రాజ్యాంగాన్ని కాపాడాలని, మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలు కొనసాగించాలని తదితర డిమాండ్ల సాధనకై విజయవాడలో ఈనెల 9న జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని బండి వెంకటేశ్వరరావు కోరారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి : టిడిపి

ముసునూరు: వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజల్లో సంతోషం అనేది లేదని, అభివృద్ధి కుంటుపడిందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కొర్లగుంట గ్రామంలో భవిష్యత్తుకు గ్యారేంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మనసుల్లో ఆనందం తిరిగి రావాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న అనుభవజ్ఞుడు అయినటువంటి నారా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముసునూరు మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్యా,గోగినేని మధు కిరణ్, తుమ్మల ఆది పాల్గొన్నారు.

ఉంగుటూరు: భవిష్యత్‌కు గ్యారంటీలో భాగంగా మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం ఉంగుటూరు మండలం కాగుపాడులో మంగళవారం నిర్వహించారు. టిడిపి ఏలూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవిశంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ కార్యక్రమం టిడిపి ఉంగుటూరు మండల మహిళా సర్పంచిలు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్ఎం

పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు సాయం

ముసునూరు: తాము పనిచేసిన పాఠశాలకు ఎంతో కొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీలపై కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లగా, ప్రస్తుతం పనిచేస్తున్న జి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఫ్రాన్సిస్, యువరాజు, నాగమల్లేశ్వరి, రత్నమాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి సన్మానించారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికై రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

చిన్న వెంకన్నను దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల చిన్న వెంకన్నను ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. మొదట ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారు, అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వాదం తెలియజేశారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి స్వామి వారి శేష వస్త్రంతో కలెక్టర్‌ను సత్కరించారు. స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక


43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

పశ్చిమగోదావరి జిల్లా
ఆగస్టు 2023



ప్రతి అక్షరం.. ప్రజల పక్షం

అవి 1980 సంవత్సరపు చివరి రోజులు. అఖిలపక్ష రైతుఉద్యమం రాష్ట్ర రాజకీయాలను ఉర్రూత లూపింది. మూడు నెలలపాటు రకరకాల పిలుపులతో రాష్ట్రం వేడెక్కింది. వారపత్రికగా నడుస్తున్న ప్రజాశక్తి ఉద్యమావసరాలకు సరిపోవడం లేదు. మరోవైపు పత్రికల విస్తరణ ఊపందుకుంది. అలాంటి తరుణంలో సిపిఎం పశ్చిమబెంగాల్ కమిటీ నుంచి అనుకోని ప్రతిపాదన వచ్చింది. అరవయ్యో దశకంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ తన దినపత్రిక అచ్చు యంత్రాన్ని బెంగాల్ కమిటీకి విక్రయించింది. దానిపైనే అప్పటివరకూ బెంగాల్‌వారు గణశక్తిని సాయంకాలపు పత్రికగా ప్రచురిస్తున్నారు. ఇప్పుడు తాము కొత్త మిషన్ కొంటున్నామని, పాత మిషన్ కావాలంటే అప్పటి ధరకే అందజేస్తామన్నది వారి ప్రతిపాదన. దీనిపై సీనియర్ నాయకులు వెనువెంటనే చర్చించి ఆమోదించారు. ప్రజాశక్తి వారపత్రికను దినపత్రికగా వెలువరించాలని నిర్ణయించారు.



1981 లో ఫ్లాట్ బెడ్ రోటరీ మిషన్ ద్వారా పత్రిక ప్రింటింగ్

ప్రజాశక్తి 43 ఏళ్ల ప్రస్థానం
అంచలంచెలుగా అభివృద్ధి

ఆ ప్రకారం 1981 ఆగస్టులో వారపత్రిక ప్రచురణ ఆగింది. 'వారపత్రికగా సెలవు – దినపత్రికగా మీ సేవకు సిద్ధం' అంటూ నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి దినపత్రిక ప్రథమ సంపాదకులు మోటూరు హనుమంతరావు వీడ్కోలు సంపాదకీయం రాశారు. దినపత్రిక సన్నాహాలు మొదలయ్యాయి. నిజానికి ప్రజాశక్తికి అరవై ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. నలభయ్యవ దశకంలో అది ప్రజల పత్రికగా, శ్రమజీవుల వాణిగా

6లో..

ప్రపంచంలో ఎక్కడ ఆపద ఉన్నా స్పందించడానికి సిద్ధంగా ఉండు.
- చే గువేరా

ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు. మార్పు మనతో మొదలైతే... ప్రపంచం అదే మారుతుంది.
- లియో టాల్‌స్టాయ్, ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

హింస ప్రతిహింసకు దారి తీస్తుంది. అందుచేత పరమత సహనం కావాలి. మతాన్ని అనుసరించడం, అనుసరించకపోవడం ప్రజల ఇష్టాయిష్టాలకు వదిలివేయాలి.
- పీరీ బాయల్, ఫ్రెంచ్ తత్వవేత్త, రచయిత

ప్రగతిబాటలో ప్రాతళ్లమెరక

పంచాయతీకి రెండు అవార్డులు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ప్రాతళ్లమెరక గ్రామం ప్రగతిబాటలో పయనిస్తుంది. అధికారులు, దాతలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థలో మార్పులు వచ్చాయి. ప్రణాళిక బద్ధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ పాలకవర్గం, అధికారులు, దాతలు తమ వంతు కృషి చేస్తున్నారు.



కంతేటి ఉష శ్రీనివాసరాజు,సర్పంచి

పల్లె ప్రగతితో మారిన గ్రామం రూపురేఖలు

ఊరి వీధుల్లో కనిపించే చెత్త డంపింగ్ యార్డుల్లోకి చేరడంతో వీధులన్నీ శుభ్రమయ్యాయి. రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. డ్రెయినేజీల్లోని మురుగు కనిపించకుండా పోవడంతో సీజనల్ వ్యాధులు మటుమాయం అయ్యాయి. శ్మశానవాటికల ఏర్పాటుతో అంతిమ సంస్కారాల అవస్థలు తప్పాయి. ఊరి పొలిమేరల్లో ప్రకృతి వనాల ఏర్పాటుతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పల్లె ప్రగతితో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు సమసిపోయాయి. పల్లెవాసుల జీవితాల్లో వినూత్న మార్పులు చోటుచేసుకోగా.. ఆర్థికంగా బలపడ్డారు.



మొక్కల పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉన్న ప్రాతళ్లమెరక

గ్రామ సచివాలయం భవనాన్ని రూ.47 లక్షలతో నిర్మించారు. హెల్త్ క్లినిక్ భవనాన్ని రూ.22 లక్షలతో, రైతు భరోసా కేంద్రాన్ని రూ.26 లక్షలతో నిర్మించారు. మాజీ సర్పంచి కనుమూరి సూర్యనారాయణరాజు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రూ.52 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని, ప్రాతళ్లమెరక గ్రామానికి చెందిన కనుమూరి రామకృష్ణంరాజు, కనుమూరి గోపాలకృష్ణంరాజు విరాళంగా ఇచ్చిన 50 సెంట్ల స్థలంలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. మంతెన సుందర రామరాజు, సూర్యకాంతమ్మ జ్ఞాపకార్థంగా కాంస్య విగ్రహావిష్కరణ, గౌతమ బుద్ధుడు, కాటన్ దొర, అంబేద్కర్, స్వామి వివేకానంద, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బస్ సెంటర్ దాట్ల పద్మ సుందరి జ్ఞాపకార్థంగా సమావేశ మందిరాన్ని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్లేగ్రౌండ్, క్యాంటీన్, చిన్న పేట ప్రాంతంలో ఏడున్నర సెంట్ల స్థలంలో బాలికల క్రీడా ప్రాంగణం, 20 సెంట్ల స్థలంలో బాలుర క్రీడా ప్రాంగణం, పల్లిపాలెం ప్రాంతంలో 65 సెంట్ల స్థలంలో క్రీడా ప్రాంగణం వంటివి ఏర్పాటు చేశారు.



ప్రాతళ్లమెరక గ్రామ సచివాలయం

రెండు పురస్కారాలు

ప్రాతళ్లమెరక పంచాయతీకి ఆరోగ్యం, సామాజిక భద్రత విభాగాల్లో పురస్కారాలు దక్కాయి. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో కాళ్ల మండల స్థాయిలో ప్రాతళ్లమెరక గ్రామానికి రెండు అవార్డులు వరించాయి. ఆరోగ్యం, సామాజిక భద్రత అంశాల్లో అవార్డులు వచ్చాయి. పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, బాల స్నేహపూర్వక, జల సమృద్ధి, పరిశుభ్రత, సామాజిక భద్రత, మహిళా హిత, స్వయం సమృద్ధి, నాణ్యమైన పరిపాలన వంటి తొమ్మిది అంశాల్లో రాణించిన గ్రామ పంచాయతీలకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు ప్రకటించారు.

ఆరోగ్య ప్రాతళ్లమెరక

సుమారు 1300 జనాభా ఉన్న ప్రాతళ్లమెరకలో జనన మరణాలు, పౌష్టికాహారం, వైద్య సదుపాయం వంటి కీలక అంశాల ఆధారంగా ఈ అవార్డు వచ్చింది. ప్రాతళ్లమెరకలో ఓ మినీ అంగన్‌వాడీతో కలిసి రెండు ప్రీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు వైఎస్ఆర్ కిట్లు, జగనన్న సంపూర్ణ పోషణ ద్వారా పిల్లలకు ప్రత్యేక మెనూ ఇస్తారు. ఇక వైద్య సేవలకు వస్తే ప్రతి ఇంటికీ వైద్యుడు కార్యక్రమంలో భాగంగా రక్తహీనత ఉన్నవారిని గుర్తించి గ్రామంలో రక్తహీనత బాలలు, గర్భిణులు, బాలింతలు లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే విజయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టువారి సహకారంతో సచివాలయ భవనం, ఆర్‌బికెతో పాటు వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ కూడా అన్ని మౌలిక వసతులతో ఏర్పాటైంది. స్థానికంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ హెల్త్ సెంటర్‌లో నివసిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్త, సచివాలయ ఎఎన్ఎం, సబ్ సెంటర్ ఎఎన్ఎం వంటి వారు గ్రామంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన, ప్రాథమిక వైద్య చికిత్సలు అందిస్తారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఇచ్చే ఫీడ్ బ్యాక్ ద్వారా హెల్త్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. అత్యవసరమైన కేసులను పిహెచ్‌సి, సిహెచ్‌సికి తరలిస్తారు. ప్రజారోగ్యంలో కీలక పాత్ర పోషించే పారిశుధ్యంపై జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రత్యేక శ్రద్ధపెట్టారు. పరిశుభ్రత కోసం రోజూ చెత్త సేకరణ జరుగుతోంది. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం ద్వారా ఇంటి పరిసరాల్లో మురికి నీరు నిల్వ లేకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

అవార్డులు మరింత బాధ్యతను పెంచాయి
కంతేటి ఉష శ్రీనివాసరాజు, సర్పంచి, ప్రాతళ్లమెరక

తమ గ్రామానికి మండల స్థాయిలో రెండు పురస్కారాలు రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డులు మరింత బాధ్యతను పెంచాయి. దాత వేగిరాజు శివవర్మ సహాయ సహకారాలతో, ప్రభుత్వ నిధులతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

టిడిపితోనే భవిష్యత్‌కు గ్యారంటీ

ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్


ప్రజాశక్తి - కాళ్ల


ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు టిడిపి పెద్దపీట వేస్తూ ఆరు కీలక పథకాలను ప్రకటించారన్నారు. పార్టీకి ఆది నుంచి అండగా ఉంటున్న బిసిలకు ఈ మేనిఫెస్టోలో స్థానం కల్పించారన్నారు. ఏటా మూడు సిలిండర్లు ఫ్రీ, మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రకటించారన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని చంద్రబాబు సంచలన హామీలిచ్చారన్నారు. టూ రిచ్ పథకంతో ఐదేళ్లలో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని టిడిపి ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. బిసిలకు అన్ని విధాలా అండగా ఉండాలనే ఉద్దేశంతో బిసిల రక్షణ చట్టం తీసుకురానుందన్నారు. టిడిపి అధికారంలోకొస్తే 'ఇంటింటికీ మంచి నీరు' పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. చంద్రబాబు రైతులకు కూడా పెద్దపీట వేస్తున్నారని, అన్నదాత పథకం పేరుతో ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు 'స్త్రీ నిధి' కింద నెలకు రూ.1500 నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. 'తల్లికి వందనం' కింద చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని ప్రకటించారని వివరించారు.



సమాజసేవలో భాస్విని ఛారిటబుల్ ట్రస్టు

దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు


కొల్లి సుబ్బారావు


ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

'ప్రజా శ్రేయస్సు కోసం భాస్విని ఛారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయం. సమాజంలో ఏ పని అవ్వాలన్నా ప్రభుత్వాల మీద ఆధారపడటం మామూలు అయిపోయింది. ఈ ట్రస్టు ముందుకొచ్చి పనులు చేస్తోంది. భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు విస్తరించి ప్రజల ఆదరాభిమానాలు మరింత పొందుతోంది. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా.. సమాజానికి ఏదోక సేవ చేయాలి. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ గ్రామీణ సంస్కృతీ సాంప్రదాయాలకు విలువిస్తారు. తెలుగు సంస్కృతిని కాపాడేందుకు భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలతో ట్రస్ట్ ప్రజలకు చేరువైంది. సంపాదించిన దాంట్లో కొంత పేద ప్రజల కోసం, కష్టాల్లో ఉన్న వారికి చేయూత నందించడం మా సంకల్పం' అంటున్నారు దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు. 2021 ఫిబ్రవరిలో గ్రామ సర్పంచిగా గెలుపొందారు. ఒకవైపు భాస్విని డెవలపర్స్ అధినేతగా మరోవైపు గ్రామ సర్పంచిగా ఉంటూ భాస్విని ఛారిటబుల్ ట్రస్టును స్థాపించారు.

పతి నెలా రూ.వెయ్యి పింఛన్

ప్రభుత్వం నుంచి పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు గత రెండు సంవత్సరాల నుంచి 35 మందికి పింఛన్లు అందిస్తున్నారు.

పరిశుభ్రత కోసం డస్ట్ బిన్‌ల పంపిణీ

గ్రామంలో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లను అందించారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, అన్ని దేవాలయాలకు పరిశుభ్రత కోసం ఆరు వేల డస్ట్‌బిన్లు అందించారు. ఐదు వేల పూల, పండ్ల మొక్కలు గ్రామంలో ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి అన్ని రకాల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు, భాస్విని ట్రస్టు ద్వారా పింఛన్లు పొందుతున్న వారికి దుస్తులు అందించారు. మహిళలకు రగ్గులు, చీరలు, పురుషులకు రగ్గులు అందించారు.

కబడ్డీ పోటీలు

యువత చెడు మార్గం వైపు మరలకుండా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా భాస్విని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతియేటా సంక్రాంతికి కబడ్డీ పోటీలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందిస్తున్నారు.

ముగ్గుల పోటీలు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు ఆర్థిక సహకారంతో భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులు వేశారు. విజేతలకు బహుమతులు అందించడంతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకూ ప్రోత్సాహక బహుమతిగా వాటర్ బాటిల్ అందించారు.

విద్యార్థులకు ప్లే గ్రౌండ్‌లో వివిధ ఆట వస్తువులు

దొడ్డనపూడిలో కొల్లి సుబ్బారావు పుట్టినరోజు వేడుకల సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఉయ్యాల, జారుడుబల్లలు అందించి, ఆటస్థలం చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ సర్పంచి సుబ్బారావు ఆర్థిక సహకారంతో భాస్విని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేశారు.

కౌలు రైతు భరోసాకు ఆర్థిక సాయం

కౌలు రైతు భరోసాకు తనవంతుగా రూ.పది లక్షల ఆర్థిక సహకారం సెప్టెంబర్ 2న పవన్‌కల్యాణ్ పుట్టిన రోజునాడు పవన్‌కల్యాణ్‌ను కలిసి అందించారు.


పలు సేవా కార్యక్రమాలు

దొడ్డనపూడిలో ఇటీవల మరణించిన యడవల్లి లక్ష్మీకాంతమ్మ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. పాలపర్తి డేవిడ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. అగ్ని ప్రమాద బాధితులకు, రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. మహాదేవపట్నంలో వృద్ధాశ్రమానికి రూ1.75 లక్షల ఆర్థిక సహకారం అందించారు.

పేదలకు విస్తృత సేవలు

భాస్విని ట్రస్ట్ అధినేత, దొడ్డనపూడి గ్రామ సర్పంచి సుబ్బారావు

పేదలకు ట్రస్ట్ ద్వారా చేయూత అందిస్తున్నాం. ఈ సేవలపై గ్రామస్తులు నాపై చూపే అభిమానం వెలకట్టలేనిది. గ్రామంలో ప్రతి పేదవాడికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు, గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తాను. పేద ప్రజలకు అన్ని విధాలా ఆర్థిక సాయం ట్రస్ట్ ద్వారా అందిస్తాను.


మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి కొల్లి సుబ్బారావు


450 ఏళ్లనాటి చరిత్ర ... వెంకటేశ్వరస్వామి ఆలయ సొంతం


ప్రజాశక్తి - కాళ్ల

ప్రముఖ దర్శనీయ స్థలాల్లో ఒకటి కాళ్ల మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న పురాతన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం. ఈ ఆలయానికి సుమారు 450 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది. అప్పట్లో స్వామి విగ్రహం నడుమ భాగం భూమిపైన, కింద భాగం భూమి లోపల ఉండడం వల్ల ఆ గ్రామానికి కాళ్లకూరు అనే పేరు వచ్చినట్లు పెద్దలు చెబుతుంటారు.

ప్రస్తుతం మొగల్తూరుగా పేరొందిన కేతలిపురం ముఖ్య పట్టణంగా ఒకప్పుడు కలిదిండి రంగరాజు పరిపాలించేవాడు. కాళ్లకూరు ఆలయ నిర్వహణకు 83 ఎకరాల భూమిని అప్పట్లో రంగరాజు దానం చేసినట్లు చెబుతుంటారు. నేటికీ ఆ భూమి ఆలయ ఆధీనంలోనే ఉంది. ఆలయంలో ప్రతి నెలా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వైశాఖ మాసంలో ఆలయంలో స్వామివారికి కళ్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దేవస్థాన ఛైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు (డివి), ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ ఆలయ ఆవరణలో ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమాచార్య విగ్రహం మనోహరంగా కనిపిస్తుంది. స్వామివారి దర్శనార్థం కాళ్లకూరు వచ్చేందుకు ఇటు భీమవరం నుంచి, అటు విజయవాడ నుంచి బస్సు సౌకర్యం ఉంది.





దండు వెంకట కృష్ణంరాజు


మోకా అరుణ్ కుమార్

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

వైసిపి ప్రాతళ్లమెరక అధ్యక్షులు వేగేశ్న బాలగణపతివర్మ



కాళ్ల:ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని వైసిపి ప్రాంతాళ్లమెరక అధ్యక్షులు వేగేశ్న బాలగణపతివర్మ అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందిస్తున్నామన్నారు. ప్రతి పేదవానికీ చేయూతగా ఉండటమే పార్టీ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో కుల, మత, రాజకీయాలకు ఆస్కారం లేదన్నారు. వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అందర్నీ కలుపుకుని ముందుకుసాగుతూ పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

మెరుగైన విద్యాబోధనకు కృషి

మాలవానితిప్ప హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరాజు



ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు తీర ప్రాంతంలో మారుమూల గ్రామమైన మాలవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాస రాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమిష్టి కృషితో హైస్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు ధీటైన బోధనతో రేపటి భవితకు భరోసా కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ పాఠశాలలో చుట్టుపక్కల ఆవాస ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల నుంచి ఐదు కిలోమీటర్ల వరకు దూర ప్రాంతాల నుంచి సుమారు 159 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. మనోవికాసానికి ఎంతో దోహదపడుతుందనే సద్భావంతో గ్రామంలోని కొంతమంది దాతల సాయంతో అర ఎకరం స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి సమకూర్చామన్నారు. పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వర్చువల్ క్లాస్‌రూమ్ (విసిఆర్), రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో డిజిటల్ క్లాస్‌రూమ్ (డిసిఆర్) ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధి హామీ చట్టం నిధులతో పాఠశాల క్రీడా ప్రాంగణానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి దాతలు 20 శాతం నిధుల భాగస్వామ్యాన్ని అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు పాఠశాల నుంచి గతేడాది కొల్లాటి శాలిని, ఈ ఏడాది గండికోట జయశ్రీ ఎన్నికయ్యారని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం నిమిత్తం రూ.కోటి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నాలుగు తరగతి గదులకు మూడు గదుల నిర్మాణం పూర్తయిందన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం క్రమంగా పెరుగుతుందన్నారు. పాఠశాల రెండుసార్లు నూరుశాతం ఉత్తీర్ణత ఫలితాలను సాధించిందని చెప్పారు. ప్రతిఏడాది సరాసరి 80 శాతం ఫలితాలను కైవసం చేసుకుంటున్నామన్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించిందన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు అమలు చేస్తూ వందరోజుల ప్రణాళికను రూపొందించి అమలు పరిచామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పుస్తకాలు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి రామయ్య టెస్ట్ పేపర్లు అందించారన్నారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషి, గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ చిలువూరి రాణి నిరంతర మార్గదర్శకత్వంలో ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో 93 శాతం ఉత్తీర్ణతతో మాలవానితిప్ప హైస్కూల్ ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని తెలిపారు.

రూ.5 కోట్లతో సీసలి అభివృద్ధి

గణేశ్న కుటుంబీకుల కృషి అమోఘం - సర్పంచి బి.ధనలక్ష్మి

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామాభివృద్ధిలో గణేశ్న కుటుంబీకుల పాత్ర 46 ఏళ్ల నుంచి నిర్విరామంగా సాగుతోందని ఆ గ్రామ సర్పంచి బిళ్లకుర్తి ధనలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ గణేశ్న సత్యనారాయణమూర్తి నాలుగుసార్లు గ్రామ సర్పంచిగా సేవలందించారన్నారు. గణేశ్న రాంబాబు ఒకసారి సర్పంచిగా, మరోసారి ఎంపిటిసి సభ్యులుగా గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. గణేశ్న సుబ్బలక్ష్మి ఒకసారి సర్పంచిగా పని చేశారని తెలిపారు. గణేశ్న ఎన్‌విఎస్ఎస్ఎస్.నాయుడు (చిన్న రాంబాబు) రెండుసార్లు పంచాయతీ వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారని వివరించారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తూ పంచాయతీని ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు, వైసిపి మండల కన్వీనర్ జిఎన్‌విఎస్ఎస్ఎస్. నాయుడు (చిన్న రాంబాబు) తమ వంతు సహకారం అందించడంతో గ్రామ అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. రూ.5 కోట్లతో సీసలి గ్రామాభి వృద్ధి పనులు చేపట్టామన్నారు.



సర్పంచి బి.ధనలక్ష్మి

పంచాయతీకి ఆరు సెంట్ల స్థలం

పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించడానికి స్థలం సరిపోకపోవడంతో ఐదు సెంట్ల స్థలాన్ని గణేశ్న కుటుంబీకులు ఇచ్చారని సర్పంచి ధనలక్ష్మి చెప్పారు. మరో సెంటు స్థలాన్ని విరాళంగా ఇచ్చేందుకు గణేశ్న కుటుంబీకులు ముందుకొచ్చారని తెలిపారు. ఇప్పటివరకు ఆరు సెంట్ల స్థలాన్ని పంచాయతీకి ఇచ్చారన్నారు. ఆ స్థలం విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని తెలిపారు.

వడ్డిగూడెం ప్రాంతానికి ప్రత్యేక పైపులైను

వడ్డిగూడెం ప్రాంతం సీసలి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో వేసిన పైపులైన్ దెబ్బ తినడంతో కుళాయిల ద్వారా నీరందడం లేదని సర్పంచి తెలిపారు. పంచాయతీ, జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు, సిఎం నిధులు సుమారు రూ.40 లక్షలతో ప్రత్యేక పైపులైన్ పనులు చేపట్టామన్నారు. ప్రతి ఇంటికీ పైపులైన్ వేసి కుళాయి కనెక్షన్ ఇచ్చామని తెలిపారు. పివిఎల్.నరసింహరాజు తాగునీటి పైపులను ప్రారంభించారని తెలిపారు. ఆ ప్రాంతంలో 70 ఇళ్లకు కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామా భివృద్ధికి కృషి చేశామన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు ప్రక్షాళన పనులు 27 ఏళ్ల తర్వాత రూ.ఆరు లక్షలతో చేపట్టామన్నారు.



గ్రామ సచివాలయ భవనం

నూతన గ్రామ సచివాలయ భవన నిర్మాణం

నూతన గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో జరుగుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ.22 లక్షలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రూ.17.50 లక్షలు కేటాయించారని, పనులు జరుగుతున్నాయని వివరించారు. సత్యనారాయణపురం ప్రాంతంలో పైపులైన్ పనులు రూ.రెండు లక్షలతో చేపట్టామన్నారు. సత్యనారాయణపురంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను 'నాడు-నేడు' నిధులు రూ.22 లక్షలతో చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాడు-నేడు' నిధులు రూ.50 లక్షలతో హైస్కూల్ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. కోటి రూపాయలతో ఆరు అదనపు తరగతుల భవనాలు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. హరిజనపేటలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో 'నాడు-నేడు' నిధులు రూ.15 లక్షలతో, ప్రాథమిక పాఠశాల మెయిన్ పాఠశాలలో రూ.15 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. పేద ప్రజలు వందమందికి ఇళ్ల పట్టాలు అందించి కోలనపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. హైస్కూల్ గ్రౌండ్‌ను దాతల సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించి రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఐదో వార్డులో రూ.ఐదు లక్షలు, ఏడో వార్డులో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు, జెడ్‌పి నిధులు రూ.10 లక్షలు, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.ఐదు లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. గ్రామంలో పాత పైపులైను తొలగించి జలజీవన్ పథకంలో ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి రూ.50 లక్షలతో పనులు చేయాల్సి ఉందన్నారు.



వడ్డీగూడెంలో నీటికుళాయిని ప్రారంభిస్తున్న పివిఎల్

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపిదే విజయం

వైసిపి ఏలూరుపాడు గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు



కాళ్ల: సిఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపిదే విజయమని వైసిపి ఏలూరుపాడు పార్టీ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. పేదలకు జగనన్న గృహ పథకం ద్వారా ఇళ్ల పట్టాలతో పాటు, ఇళ్లు కట్టేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో విద్య, సంక్షేమం, అభివృద్ధికి సిఎం జగన్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. నాడు - నేడు ద్వారా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించడంతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. వైసిపిని బలోపేతం చేసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉండిలో వైసిపి జెండా ఎగురవేసేందుకు తామంతా సమిష్టి కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు కృషి

ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు



కనకరాజు, ఎంఇఒ2

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేలా రాష్ట్ర విద్యాశాఖ వే లవ్ రీడింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు 73 ఉన్నాయన్నారు. 8,584 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. 63 ప్రభుత్వ పాఠశాలల్లో 130 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని వివరించారు. మండలంలో నాలుగు చోట్ల నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో 45 నిమిషాలపాటు వే లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించా మన్నారు. విద్యార్థులకు మోడల్ పాఠం బోధిస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం తోపాటు తెలుగు మీడియం కూడా కొనసాగుతుందన్నారు. జగనన్న విద్యా కానుకలు, పాఠ్యపుస్తకాలు 95 శాతం విద్యార్థులకు అందించామన్నారు. మండలంలోని ప్రతి పాఠశాల విద్యార్థికీ చదవడం, రాయడం వచ్చేలా చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. చదవడం, రాయడం వస్తే ప్రతి సబ్జెక్టునూ అర్థం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కొందరు విద్యార్థులు సభ్యులుగా వే లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి శనివారం సమావేశం నిర్వహిస్తూ ఉపాధ్యాయులకు పలు సూచనలు అందిస్తున్నామన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం

(మొదటిపేజీ నుంచి)

పేరొందింది. భాషా సంస్కృతి తదితర అంశాల్లో కూడా ప్రజాప్రయోజనాలకు పట్టం కట్టింది. ఇది సహించలేని వాళ్లు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్– ప్రజాశక్తి పాస్' అంటూ అక్కసు వెలిబుచ్చేవారు. చదువురాని వాళ్లను కూడా చైతన్యపరిచేలా పదునైన భాషలో పత్రిక రావడమే వారి ఆగ్రహానికి కారణం. ప్రజాశక్తి ప్రభుత్వ నిర్బంధానికి గురైన తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితులు ఏర్పడి పత్రికను పునరుద్ధరించినా ఆ పేరుతో గాక విశాలాంధ్ర పేరుతో వచ్చింది. మళ్లీ రాజకీయావసరాల రీత్యా 1968 నుంచి దాదాపు పదమూడేళ్లపాటు ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీల వాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ పత్రిక తొలిప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య.. కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటిపేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పునఃప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ శతజయంతి ఉత్సవాలు వచ్చాయి. అ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

కొత్త యంత్రం.. నూతన భవనం

అప్పటికే తెలుగు దినపత్రికల్లో కొత్త పోకడలు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రభ స్థానంలో ఈనాడు అగ్రశ్రేణి దినపత్రికగా అవతరించింది. జర్నలిజంలో కొత్త ధోరణులు తీసుకొచ్చింది. పార్టీ సంబంధమైన వార్తలను కూడా ప్రజాశక్తిని మరపించేలా ఇవ్వాలన్నది దాని వ్యూహం. ఆ విధంగా 1982లో మహాసభ సందర్భంగా నాయకుల ఇంటర్వ్యూలు వగైరాలు ఎంతో విస్తృతంగా ఇచ్చింది. వనరులు, నిపుణులు ఎక్కువ. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి పాఠకుల్లో కూడా మరింత కొత్తదనం కావాలనే ఆకాంక్ష పెరిగింది. ఈలోగా ఎన్‌టిఆర్ రంగప్రవేశం, విజయం ఇవన్నీ రాజకీయాలను, మీడియాను అమితంగా ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో బెంగాల్‌నుంచి తెచ్చుకున్న పాతమిషన్‌పై పత్రికను ప్రచురించడం ఆచరణ సాధ్యం కాని విషయంగా మారింది. అందుకే ఆఫ్‌సెట్ యంత్రాన్ని తెప్పించాలని నిర్ణయమైంది. అప్పటివరకూ మార్క్సిస్టు కార్యాలయంలో ఒక భాగంగా తీసుకుని నడుస్తున్న ప్రజాశక్తికి నూతన భవనం కూడా అవసరమని భావించారు. అలాంటి సమయంలో ఉద్యమ శ్రేయోభిలాషులైన కాట్రగడ్డ శ్రీనివాసరావు.. నవరంగ్ టాకీస్ పక్కన ఉన్న విలువైన స్థలాన్ని ప్రజాశక్తికి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. 1983 మే 1న, ఆ రోజు మేడే మాత్రమే కాక సుందరయ్య జన్మదినం కూడా. ఆయనకు మహాభిమాని, సన్నిహితుడు అయిన శ్రీనివాసరావు ఆ రోజునే భవనాన్ని అంకితం చేయాలని నిర్ణయించారు. సీనియర్ నాయకులైన బిటి రణదివే వచ్చి భవన ప్రారంభోత్సవంతో పాటు ప్రధానోపన్యాసం చేశారు. ఆఫ్‌సెట్‌లో అందంగా ముద్రించిన పత్రికను చూసి పాఠకులు ఎంతగానో మెచ్చుకున్నారు. అప్పటినుంచి సాంకేతికంగానూ పత్రికలో నూతన ప్రయోగాలు మొదలయ్యాయి. మిగిలిన వారికున్న హంగులు లేకున్నా పత్రికలోని యువ మిత్రులు ప్రయోగశీలతతో దాన్ని విభిన్నంగా తేవడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నించారు. ఇతర ప్రముఖ పత్రికలవారు కూడా హర్షిస్తూ వచ్చారు. పార్టీ పత్రికే అయినా ప్రజాశక్తి భిన్నంగా ఉంటుందనే వాదన బలపడింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఊపిరి

ఇంతలో నాదేండ్ల వెన్నుపోటుతో ఎన్‌టిఆర్ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉద్యమం మొదలైంది. ప్రజాశక్తి ఆ ఘట్టంలో ఒక ముఖ్య భాగస్వామి అయింది. ప్రజాస్వామ్య ఉద్యమం విజయవాడ నుంచి ప్రారంభమైన రోజునే ప్రత్యేక సంచిక విడుదల చేయడంతో ప్రతివారి చేతిలోనూ అదే కనిపించింది. అప్పటినుంచి నెలరోజుల పాటు మోటూరు హనుమంతరావు.. ప్రతీరోజూ ఇదే విషయమై సంపాదకీయాలు రాశారు. దానికితోడు కదం తొక్కించే శీర్షికలు, నాదేండ్ల మంత్రివర్గాన్ని విస్తరించినప్పుడు 'కీలుబొమ్మ మంత్రివర్గంలో తోలుబొమ్మలు' అని పెట్టిన హెడ్డింగ్ ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే ఆ నెలరోజులూ ప్రజాశక్తి ప్రజాస్వామ్య ఉద్యమాభిమానుల ఆదరణకు పాత్రమైంది. ఎన్‌టిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్టించిన తరుణంలో అన్నిటికన్నా ముందు ప్రజాశక్తి మార్కెట్లో విడుదలై సంచలనం సృష్టించింది. ముఖ్యమైన పరీక్షా ఫలితాలు వంటివి కూడా పోటీపడి విడుదల చేయడానికి కృషి పెరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉత్సాహవంతులైన కార్యకర్తలు విలేకరులుగా వార్తలు పంపించడంతో కవరేజి కూడా మెరుగైంది.

ప్రత్యేకతలు - ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్యదినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రికస్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్దఫోటో హిందూ తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్టు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్‌ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి. ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జతచేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయనైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేష కృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతలలో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు సంపాదకీయం దానికి పెద్దపెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితబావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలతో దీటుగా అది ముందుకు సాగింది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫోటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పని చేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యాన్ని పంచిపెట్టింది. 1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది.

1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంతో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ సహ సంపాదకునిగా ఉన్న ఎన్ రామ్ బోఫోర్సు కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. బోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి సాయంత్రం మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

మరో మలుపు


1990 ప్రజాశక్తిలో మరోమలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే వివిధ దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశపెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకున్నది. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకు కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరిగైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు. తర్వాత కాలంలో పత్రిక అభివృద్ధి వేగం పుంజుకుంది. 1991లో సోవియట్ విచ్ఛిన్నం,

7లో..

పురిటిగడ్డపై మమకారం.. ప్రగతికి సహకారం

సొంతూరి అభివృద్ధికి దాట్ల శ్రీదేవి ట్రస్టు కృషి
గౌరవ డాక్టరేట్ పొందిన ట్రస్టు చైర్మన్ దాట్ల వెంకటరామరాజు


డాక్టరేట్ అందుకుంటున్న శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి మనిషీ పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలని పెద్దలు చెబుతుంటారు. అయితే అతి తక్కువ మంది మాత్రమే దాన్ని ఆచరిస్తుంటారు. వారిలో ఒకరు కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల వెంకటరామరాజు. పుట్టిన గడ్డకు మేలు చేయాలనే సదాశయంతో ఆయన హైదరాబాద్ నుంచి తిరిగొచ్చి ట్రస్ట్ ప్రారంభించారు. తన కుమార్తె పేరిట దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్‌ను స్థాపించారు. శ్రీదేవి అకాల మరణంతో 2022లో ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు.


కాళ్లకూరులో అభివృద్ధి చేసిన పద్మావతి తాగునీటి చెరువు

రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దాట్ల రామకృష్ణంరాజు, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మోక్ష ధామం, వెంకటేశ్వర, పద్మావతి మంచినీటి చెరువు అభివృద్ధి, పలు రేవుల నిర్మాణ పనులను ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో చేపట్టారు.


గ్రామ ప్రజలు తమ బంధువుల కర్మకాండలు నిర్వహించుకునేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ట్రస్ట్ ద్వారా సంకల్పించారు. నాలుగు దహన గదుల షెడ్లు, రెండు రేవులు, మూడు వైపులా ఫెన్సింగ్, ఆహ్లాదాన్ని ఇచ్చేలా మొక్కలను నాటారు. వాటన్నింటినీ ఏర్పాటు చేసేందుకు ట్రస్టు ద్వారా సుమారు రూ.30 లక్షలు వెచ్చించారు. క్రిస్టియన్ పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు వంతెన అభివృద్ధి పనులు రూ.4 లక్షలతో చేపట్టారు. మేరీమాత గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి మేరీమాత ఉత్సవం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలో ఆరు ప్రాంతాల్లో 20 సిమెంట్ బెంచీలను ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేశారు. శివరాత్రి, శ్రీరామనవమి సందర్భంగా అన్న సమారాధనలు నిర్వహించారు. వేసవిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి మే, జూన్ నెలల్లో దీన్ని నిర్వహించారు. పేదల వివాహనికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు, కంటి ఆపరేషన్లకు, పేదల దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించడంలో ముందున్నారు.

సేవలకు గుర్తుగా గౌరవ డాక్టరేట్

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలను బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గుర్తించింది. ఆ యూనివర్సిటీ గత ఏప్రిల్‌లో ట్రస్టు చైర్మన్ దాట్ల వెంకటరామరాజుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

వెంకటేశ్వర పద్మావతి మంచినీటి చెరువు అభివృద్ధి

వెంకటేశ్వర-పద్మావతి మంచినీటి చెరువు పూడిపోయింది. చెరువులో రేవులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వెంకటేశ్వరస్వామి వారికి, రామాలయంలో పూజలు నిర్వహించే అర్చకులు ఈ రేవుల నుంచి నీటిని నిత్యం తీసుకెళ్తుంటారు. మంచినీటి చెరువును అన్నివిధాలా అభివృద్ధి చేయాలని వెంకటరామరాజు సంకల్పించారు. గ్రామంలో కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి-పద్మావతి మంచినీటి చెరువు అభివృద్ధి పనులను 25 ఏళ్ల తర్వాత చేపట్టారు. సుమారు రూ.13 లక్షలతో చెరువులో పూడికతీత పనులను, మూడు రేవులను, రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను పివిఎల్.నరసింహరాజు ప్రారంభించారు. పివిఎల్.నరసింహారాజు చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ దాట్ల వెంకటరామరాజును సత్కరించారు.



వెంకటరామరాజును సత్కరిస్తున్న పివిఎల్.నరసింహారాజు

ప్రతి అక్షరం... ప్రజల పక్షం

(మొదటిపేజీ నుంచి)

1992లో బాబ్రీ మసీదు విధ్వంసం వంటి సందర్భాల్లో ప్రజాశక్తి నిర్వహించిన పాత్ర దాన్ని ప్రగతిశీల లౌకిక శక్తులకు మరింత దగ్గర చేసింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. జయప్రదంగా నడిచింది. ఇది తెలుగులో వామపక్షపత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

కొత్త పుంతలు

ప్రజాశక్తి ప్రజా ఉద్యమాలతో, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి. 1997లో విశాఖ ఎడిషన్ రాష్ట్రంలో మూడో ఎడిషన్‌గా అవతరించింది. ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, ఒంగోలు, శ్రీకాకుళం ఎడిషన్లు వచ్చాయి. ఇంతేకాక వందల సంఖ్యలో కంప్యూటర్ కేంద్రాలు వెలిశాయి. జిల్లా సబ్ సెంటర్లు ఏర్పడ్డాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, విస్తరించిన పునాది, మారిన దృక్పథం ఇవన్నీ కలిసి ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి. ఫలితంగా దాని ప్రతిష్ట, ప్రజాదరణ పెరిగాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజాశక్తి కొనసాగుతోంది. తెలంగాణలో 2015 మార్చి 21 'నవ తెలంగాణా' పత్రికగా రూపాంతరం చెందింది. 2005 తరువాత రాష్ట్రంలోని వివిధ టాబ్లాయిడ్లు రంగుల్లోకి వచ్చాయి. మెయిన్ 8 నుంచి 10 పేజీలకు, 12 పేజీలకు పెరిగింది. పాఠకులను ఆకట్టుకోవడానికి 'జీవన' శీర్షికతో నాలుగు పేజీలు వచ్చాయి. ఇలా అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీని వాడుకొని ప్రజాశక్తి ముందుకుపోతోంది. పత్రిక అభిమానులు, శ్రేయోభిలాషులు ఉద్యమ బాధ్యతను ప్రత్యేక కాంపెయిన్లతో దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తూనే ఉన్నారు. అయితే ఇంతలోవచ్చిన కరోనా మహమ్మారి అనేక రంగాలపై తీవ్రప్రభావం చూపుతోంది. ప్రజాశక్తిపై కూడా ఆ ప్రభావం తీవ్రంగా పడింది. ఫలితంగా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా పేజీలను తగ్గించుకోవాల్సి వచ్చింది. జిల్లా వార్తలకు మెయిన్‌లో రెండు పేజీలు కేటాయించింది. ఉన్న పరిమితులతోనే నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవడానికి కృషి చేస్తూ ప్రజాశక్తి ప్రస్థానం సాగిస్తోంది. ప్రత్యామ్నాయ ప్రజా జర్నలిజానికి ప్రతీకగా వెలుగొందుతోంది. ప్రతీ అక్షరం ప్రజల పక్షం అని చాటుతోంది.

నాడు విద్యార్థిని.. నేడు హెచ్‌ఎం



ప్రజాశక్తి - కాళ్ల

ఒకనాడు ఆ పాఠశాలలో విద్యార్థిని.. నేడు అదే పాఠశాలకు హెచ్‌ఎంగా పనిచేస్తున్నానని జువ్వలపాలెం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు ఎస్‌వి. అప్పల నాయుడు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జువ్వలపాలెం గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 1973 -78 విద్యా సంవత్సరాల మధ్య ఒకటి నుంచి ఆరో తరగతి వరకూ విద్యనభ్యసించానని తెలిపారు. తాను బిఇడి, ఎంకామ్, ఎంఎ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినట్లు చెప్పారు. చిన్న నాటి నుంచి చదువుపై ఉన్న మక్కువ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంచెలు అంచెలుగా ఎదిగి 1998లో నరసాపురం మండలం పెదమైనివాని లంక-2 ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యానన్నారు. ఇప్పటివరకు పలు మండలాల్లోని పాఠశాలల్లో పని చేస్తూ బదిలీపై 2021లో తాను చదువుకున్న జువ్వల పాలెం పాఠశాలకే ఉపాధ్యాయుడిగా వచ్చానని తెలిపారు. ఇటీవల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నా న్నారు. ఉపాధ్యాయుడుగానే కాకుండా చదువుకు న్న పాఠశాలకే హెచ్‌ఎంగా రావడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలను అన్నివిధాలా ప్రథమస్థానంలో నిలబెడతానని తెలిపారు.

మారిన పాఠశాలల రూపురేఖలు



కలవపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీతారామమూర్తి

కాళ్ల: నాడు - నేడు నిధులు మొదటి విడతలో రూ.30 లక్షలతో పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారాయని కలవపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జె.సీతారామమూర్తి అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాల తరహాలో అన్ని హంగులతో ఆహ్లాదకరంగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. వేటుకూరి వెంకట సుబ్బరాజు కుమారుల ఆర్థిక సహకారం రూ.4 లక్షలతో హైస్కూల్ ముఖద్వారం నిర్మించామన్నారు. జయలక్ష్మి మెమోరియల్ ట్రస్టు అధినేత వేగిరాజు శివవర్మ రూ.12 లక్షల ఆర్థిక సహకారంతో భోజనశాల నిర్మాణం చూడ చక్కగా ఉందన్నారు. నాడు - నేడు రెండో విడతలో రూ.1.74 లక్షలతో ఫర్నిచర్ సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులకు సౌకర్యంగా ఐఎఫ్‌బి ప్యానల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, ఆయన సోదరుడు మంతెన పెద్ద నరసింహరాజు రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో సభా వేదిక నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామస్తులకు, దాతలకు, తల్లిదండ్రుల కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

నాడు-నేడుతో పాఠశాల అభివృద్ధి

వేంపాడు(హిందూ) ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు



ప్రజాశక్తి - కాళ్ల

నాడు - నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందాయని వేంపాడు హిందూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెల్లంకొండ నాగమురళి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తన పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించడానికి నాడు - నేడు నిధులతో అభివృద్ధి పనులు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో ప్రహరి గోడ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి, ఉప సర్పంచి వేగేశ్న సుమన్, ప్రముఖ డాక్టర్ రామకృష్ణం రాజు, తల్లిదండ్రుల కమిటీ సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పాఠశాల భవనాలకు వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దామన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య

వేంపాడు ఎల్‌ఇ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరవికుమార్‌రాజు



ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే విద్యార్థులకు ఉన్నతమైన విద్య నాడు - నేడు ద్వారా లభించనుందని వేంపాడు ఎల్‌ఇ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేటుకూరి వెంకట రవికుమార్ రాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నాడు - నేడు రెండో విడత నిధులు రూ.15.25 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాడు - నేడు నిధులతో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నామని తెలిపారు.